క్లుప్తంగా

ప్రాణ రక్షణ కల్పించాలని వినతి

నెల్లూరు రూరల్: తన స్థలాన్ని వేరే వ్యక్తుల పేరిట రిజిస్టర్ చేయాలని, లేని పక్షంలో చంపుతామని బాలకృష్ణారెడ్డి అతని భాగస్వాములు బెదిరిస్తున్నారని దొడ్డంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గుండ్లపాళెంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. తనకు చెందిన 4.05 ఎకరాల భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారి బాలకృష్ణారెడ్డికి విక్రయించానని, అగ్రిమెంట్ కాల పరిమితి ముగిసినా, తనను బెదిరించి వాటిని పునరుద్ధరించారని చెప్పారు. విక్రయించిన భూమే కాకుండా తనకు చెందిన దాదాపు 80 అంకణల స్థలాన్ని ఉచితంగా రిజిస్టర్ చేయాలని, లేని పక్షంలో చంపుతామని బెదిరిస్తున్నారని వాపోయారు. పోలీస్ ఉన్నతాధికారులు విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై పోలీస్ స్పందనలో ఫిర్యాదు చేశానన్నారు.

రేపట్నుంచి మహాకుంభాభిషేక పూజలు

నెల్లూరు రూరల్: పొట్టేపాళెంలో జీర్ణోద్ధరణ చేసిన వరసిద్ధి వినాయక ఆలయంలో గురువారం నుంచి ఆదివారం వరకు మహాకుంభాభిషేక పూజలను నిర్వహించనున్నారు. ఉత్సవాలకు ఆలయం ముస్తాబైంది. ఆయా రోజుల్లో స్వామి వారికి ప్రత్యేకాభిషేకాలు, పూజలను నిర్వహించనున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నవాబుపేట రైతుబజార్ సబ్‌స్టేషన్ పరిధిలో గల బోడిగాడితోట ఫీడర్‌లో విద్యుత్ లైన్లను మార్చనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో సరఫరా బుధవారం ఉండదని నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాకీర్‌హుస్సేన్‌నగర్, శ్రీనివాసనగర్, బోడిగాడితోట, సింహపురికాలనీ, మైపాడు గేట్ తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

- సరస్వతీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని రామ్‌నగర్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా కొండాయపాళెం గేట్, పాత మిలటరీ కాలనీ, రామ్‌నగర్, తదితర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు సరఫరా ఉండదని తెలిపారు.

ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డికి సన్మానం



నెల్లూరు (టౌన్): డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్ కోసం రవాణా శాఖ కార్యాలయానికి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన్ను డీటీసీ చందర్ సత్కరించారు. అనంతరం ఆయన లైసెన్స్‌ను రెన్యువల్ చేశారు. డ్రైవింగ్ ట్రాక్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్టీఓ సిరిచందన, ఎంవీఐలు మురళీమోహన్, బాలమురళీకృష్ణ, ఏఓలు రామ్మోహన్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా హాకీ పోటీలు



నెల్లూరు రూరల్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని వెల్లంటిలోని జెడ్పీ హైస్కూల్లో హాకీ పోటీలను జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. బాలుర విభాగంలో 10, బాలికల విభాగంలో నాలుగు జట్లు తలపడ్డాయి. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులను ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు అందజేశారు. హాకీ అసోసియేషన్ కార్యదర్శి భాస్కర్‌రావు, లక్ష్మయ్య, రవిబాబు పాల్గొన్నారు.

వేడుకగా సీతారాముల కల్యాణం



నెల్లూరు(బృందావనం): నగరంలోని శబరి శ్రీరామక్షేత్ర వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సీతారాముల కల్యాణాన్ని వేడుకగా మంగళవారం నిర్వహించారు. హనుమత్, సీతా, లక్ష్మణ సమేత కోదండరామస్వామికి పంచామృతాభిషేకాలు, హోమం, సామూహిక లక్ష తులసీ దళార్చన, పూర్ణాహుతిని విశేషంగా జరిపారు. స్వామివారు, ఆంజనేయస్వామికి పల్లకి సేవను నిర్వహించారు.

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న తిరుమలేశ్వరరెడ్డి

- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): విధి నిర్వహణలో మృతి చెందిన పోలీస్ సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గతేడాది సెప్టెంబర్ నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 16 మంది సిబ్బంది విధి నిర్వహణలో మృతి చెందిన తరుణంలో వారి కుటుంబసభ్యులతో ఆత్మీయ సమావేశాన్ని నగరంలోని ఉమేష్ చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం నిర్వహించారు. పోలీస్ వెల్ఫేర్ డేను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధిత కుటుంబాల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కారుణ్య నియామకాలపై వారి సందేహాలను నివృత్తి చేశారు. ప్రభుత్వం నుంచి బెనిఫిట్స్ వారికి అందేలా చూడాలని ఆదేశించారు. అనంతరం వారికి భోజనాలను అందజేశారు. ఏఎస్పీ హిమవతి, ఏఆర్ డీఎస్పీ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

విధులను సక్రమంగా నిర్వర్తించండి



మాట్లాడుతున్న ఆనం అరుణమ్మ

నెల్లూరు (పొగతోట): శిక్షణను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకొని, విధులను సక్రమంగా నిర్వర్తించాల్సిందిగా పంచాయతీ సెక్రటరీలకు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ సూచించారు. కొండాయపాళెం గేట్ సెంటర్‌లోని ఓ సమావేశ మందిరంలో పంచాయతీ సెక్రటరీలకు ఏపీఎస్సైఆర్డీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంగళవారం హాజరైన ఆమె మాట్లాడారు. పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇలాంటి శిక్షణ ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించి మెరుగైన సేవలను అందించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. జెడ్పీ సీఈఓ చిరంజీవి, ఏపీఎస్సైఆర్డీ జిల్లా శిక్షణ పరిశీలకురాలు రాజ్యలక్ష్మి, డీపీఓ సుస్మితారెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుకు ఆర్థిక చేయూత



నెల్లూరు(క్రైమ్): అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హోంగార్డుకు సహచర హోంగార్డులు ఆర్థిక చేయూతనందించారు. నవాబుపేట పోలీస్‌స్టేషన్లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న ప్రతాప్ కొంతకాలంగా మధుమేహ వ్యాధితో బాధపడుతున్నారు. వ్యాధి తీవ్రత నేపథ్యంలో కాలుకు శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచించారు. దీంతో చెన్నైలోని విజయ హాస్పిటల్లో ఆయన్ను చేర్పించారు. చికిత్స వ్యయంతో కూడుకుంది కావడంతో తోటి హోంగార్డులు తమ వంతుగా రూ.33,600ను సమకూర్చారు. ఈ మొత్తాన్ని హోంగార్డ్స్ డీఎస్పీ చంద్రమోహన్ చేతుల మీదుగా ప్రతాప్ సతీమణికి అందజేశారు. హోంగార్డ్స్ ఆర్ఐ పాల్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

మేజర్ ధ్యాన్‌చంద్‌కు నివాళి



ఏసీ స్టేడియంలో..



క్రీడా ప్రతిజ్ఞ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని నెల్లూరు జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నివాళులర్పించారు. ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ర్యాలీని నిర్వహించిన అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. డీఎస్ఏ చీఫ్ కోచ్ యతిరాజ్, సీనియర్ క్రీడాకారులు భానుప్రకాష్, పెంచలయ్య, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

- నేటితరం క్రీడాకారులు మేజర్ ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సెట్నెల్, డీఎస్ఏ సీఈఓ నాగరాజకుమారి పేర్కొన్నారు. ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో హాకీ పోటీలను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడా ప్రతిజ్ఞ చేశారు. డీఎస్ఏ హాకీ కోచ్ చందు, చీఫ్ కోచ్ యతిరాజ్, సీనియర్ క్రీడాకారుడు జెఫన్యా, స్టేడియం సూపరింటెండెంట్ విజయ్, హాకీ క్రీడాకారులు కొండయ్య, భానుప్రకాష్, పెంచలయ్య, మహ్మద్, జాషువా తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా వెంకటేశ్వరుడి కల్యాణం



నెల్లూరు(బృందావనం): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా మంగళవారం నిర్వహించారు. తొలుత పంచామృతాభిషేకాలను జరిపారు. ఉభయకర్తలుగా వాయుగుండ్ల సుధాకర్, భవానీ దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లుగుప్తా, రత్నం, కోశాధికారి మస్తాన్‌రావు, అమరా మోహన్‌రావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కాత్యాయని వ్రతం



నెల్లూరు(బృందావనం): శ్రావణ మాస రెండో మంగళవారాన్ని పురస్కరించుకొని నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కాత్యాయని వ్రతాన్ని వేడుకగా మంగళవారం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు సూరావఝుల రఘురామశర్మ, అవ్వారి వెంకటరామకృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈఓ వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ జయరామ్ పాల్గొన్నారు.

రంగడి దేవస్థానంలో పవిత్రోత్సవాలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో భాగంగా విశేష పూజలను మంగళవారం జరిపారు. ఆలయ ప్రధానార్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు, నిశింద సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం గోపురోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, సభ్యుడు నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల కాలనీలో అన్నదానం

నెల్లూరు(బృందావనం): పడారుపల్లి దివ్యాంగుల కాలనీలోని పీసీ రెడ్డి సమాజ మందిరంలో అన్నదానాన్ని మంగళవారం నిర్వహించారు. నగరానికి చెందిన గోపాలకృష్ణమూర్తి దంపతులు తమ కుమార్తె ఆద్య రెండో జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారు. క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మంత్రికి కృతజ్ఞతలు



నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన వేలూరు శివకుమార్‌రెడ్డి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలియజేశారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డితో కలిసి మంత్రితో నగరంలోని ఆయన నివాసంలో మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. పార్టీ నేతలు కోడూరు కమలాకర్‌రెడ్డి, రామిరెడ్డి, రమేష్‌రెడ్డి, విజయ డెయిరీ ఎండీ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డిని పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి విజయవాడలో మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డిని సత్కరించారు.

అగ్నిమాపక శాఖ డీజీపీతో భేటీ

నెల్లూరు(బృందావనం): నగరానికి మంగళవారం విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ డీజీపీ సునీల్‌కుమార్‌ను నగరంలోని ఓ హోటల్లో ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ రాజశేఖర్ దాసరి మర్యాదపూర్వకంగా కలిశారు. వివిధ అంశాలను ఆయనకు వివరించారు.

నేత్రదానం



గాయత్రీదేవి (ఫైల్)

నెల్లూరు(సెంట్రల్): బాలాజీనగర్‌కు చెందిన వేమూరి గాయత్రీదేవి (74) అనారోగ్యంతో మృతి చెందారు. ఈ క్రమంలో కుటుంబసభ్యుల ఆంగీకారంతో ఆమె నేత్రాలను ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వైద్యులు సేకరించారు. అనంతరం కుటుంబసభ్యులకు సర్టిఫికెట్‌ను అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99481 64781 నంబర్‌ను సంప్రదించాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ శర్వాణి పేర్కొన్నారు.

కోలాహలంగా ఓనం



నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో ఓనం పండగను కేరళ సంప్రదాయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వామికి నవకలశ నవాభిషేకం, విశేష పుష్పార్చనను భక్తిశ్రద్ధలతో జరిపారు. అనంతరం భగవతిసేవను నిర్వహించారు. అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, శంకరన్, మోహన్‌రావు, మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృ భాషా దినోత్సవం



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులు



ఆర్టీసీ కార్యాలయంలో..



డీపీఆర్వో కార్యాలయంలో..



రవాణా శాఖ కార్యాలయంలో..

నెల్లూరు సిటీ: మాతృ భాషా దినోత్సవాన్ని నగరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు

- మద్రాస్ బస్టాండ్ సమీపంలోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ కార్యాలయంలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డీడీ వెంకటయ్య, సబ్ రిజిస్ట్రార్ రాంబాబు, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.
- నగరంలోని జిల్లా ప్రజా రవాణా శాఖ కార్యాలయంలో గిడుగు రామ్మూర్తి జయంతిని నిర్వహించారు. పీఓ రమణ, నెల్లూరు ఒకటో డిపో మేనేజర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(దర్గామిట్ట): తెలుగు భాషను సరళీకృతం చేసి వ్యావహారిక భాషగా తీర్చిదిద్దేందుకు అవిరళ కృషి చేసిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి పంతులు అని జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి సుధారావు కొనియాడారు. కలెక్టరేట్లోని జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. జిల్లా ఆడిట్ అధికారి నరసింహం, సమాచార కార్యాలయ డీఈ శివశంకర్, ఏపీఆర్వో రవీంద్రబాబు, ఫరీద్ మస్తాన్, సీనియర్ అసిస్టెంట్లు ఖాదర్ మస్తాన్, సువర్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (టౌన్): నగరంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. ఉప రవాణా కమిషనర్ చందర్ పాల్గొన్నారు.

- నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసపత్రాలను అందజేశారు. తెలుగు అధ్యాపకులు కరుణశ్రీ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ప్రసాద్, జిల్లా క్షేత్ర ప్రచారాధికారి నాగసాయిసూరి, సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ సదారావు, జర్నలిస్ట్ జయప్రకాష్, అధ్యాపకులు సురేంద్ర, సత్యనారాయణ, సుభాషిణి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.
- నగరంలోని సమగ్రశిక్ష కార్యాలయంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏపీసీ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలి



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో పరిపూర్ణమైన ఓటర్ల జాబితా తయారీకి రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని కమిషనర్ వికాస్ మర్మత్ కోరారు. ఓటర్ల జాబితా సవరణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కొన్ని సమస్యలను తెలియజేయగా, వీటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. ఓటర్ల జాబితాను రూపొందించడంలో బీఎల్వోలకు సహకరించాలని కోరారు. 21 ఏళ్లు దాటినా ఇప్పటికీ ఓటు నమోదు చేయించుకోని వారు.. 80 ఏళ్లు నిండిన ఓటర్లను ప్రత్యక్షంగా విచారించాలని కోరారు. ఇంట్లో పది మందికిపైగా ఓటర్లు నమోదై ఉంటే వారినీ క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఒకే ఇంట్లోని వారికి వేర్వేరు పోలింగ్‌స్టేషన్లలో ఓట్లు ఉంటే, వారికి ఒకే చోట ఉండేలా చర్యలు చేపట్టనున్నామని పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ నేత ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులను వేగవంతం చేయండి

జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు గానూ అదనపు కార్మికులను నియమించాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. వెంకటేశ్వరపురంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను హౌసింగ్ విభాగం, ఎస్పీడీసీఎల్ అధికారులతో కలిసి పరిశీలించిన అనంతరం కమిషనర్ మాట్లాడారు. నిర్మాణ పనులను నూరు శాతం పూర్తి చేసి గృహాలను లబ్ధిదారులకు అందజేయాలని కోరారు. జగనన్న కాలనీలకు రవాణా సౌకర్యాన్ని కల్పించాలని పేర్కొన్నారు.

ఖాళీ ప్లాట్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జనావాసాల మధ్య ఖాళీ ప్లాట్లను సంబంధిత యజమానులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. నగరంలోని 15వ డివిజన్లో గల బాలాజీనగర్, ఏసీనగర్, రామ్‌జీనగర్, తదితర ప్రాంతాల్లో పర్యటించిన ఆయన మాట్లాడారు. ఖాళీ స్థల యజమానులకు నోటీసులను జారీ చేయాలని ఆదేశించారు. భవన నిర్మాణ సామగ్రిని రోడ్లపై వేయకుండా పట్టణ ప్రణాళిక విభాగాధికారులు చర్యలు చేపట్టాలని చెప్పారు. తడి, పొడి చెత్త సేకరణకు డస్ట్‌బిన్లను దుకాణాల ఎదుట ఉంచాలని స్పష్టం చేశారు. ఎంహెచ్ఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కళాకారుడికి అభినందన



నెల్లూరు(బృందావనం): గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కులో సీనియర్ కళాకారుడు దోస్తీబాషాను సంకీర్తన కళాసమితి అధ్యక్షుడు చింతా ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. గాయకుడు పాటూరు శ్రీనివాసులు, మురళీమోహన్‌రావు, కేతా సుబ్బారావు, రాయప్ప, యజ్దానీ, సత్యం, రవీంద్ర, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఏ కోర్సుతో ఎంతో ఉపయోగం



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నెల్లూరు (టౌన్): నిరుద్యోగ సమస్యను అధిగమించేందుకు సీఎంఏ కోర్సు ఎంతో ఉపయోగపడుతుందని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా సదరన్ ఇండియా రీజినల్ కౌన్సిల్ సెక్రటరీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. బృందావనంలోని నెల్లూరు చాప్టర్ కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. సీఎంఏ రెండున్నరేళ్ల కోర్సు అని, అతి తక్కువ ఖర్చుతో దీన్ని పూర్తి చేయొచ్చని చెప్పారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకెళ్దాం

నెల్లూరు(పొగతోట): ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా సాగుదామని ఏపీ ఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు పెంచలరావు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ హియరింగ్ హ్యాండీక్యాప్డ్ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా శాఖ ఎనిమిదో సంవత్సరంలోకి అడుగిడనున్న తరుణంలో ఎన్జీఓ అసోసియేషన్ భవనంలో కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. హియరింగ్ హ్యాండీక్యాప్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కుమార్, కార్యదర్శి నాయుడు వెంకటస్వామి, జిల్లా కోశాధికారి బండారుపల్లి వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షుడు నందిమండలం ఆంజనేయవర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షులు మధు, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి డబ్బులివ్వలేదని హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): మద్యానికి డబ్బులివ్వలేదనే కోపంతో వ్యక్తిపై ఇద్దరు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. కుసుమ దళితవాడకు చెందిన నటరాజ్ అభిషేక్ ఇంటి సమీపంలో రాఖీ, చంద్రశేఖర్ నివాసం ఉంటున్నారు. మద్యం తాగేందుకు డబ్బులివ్వాలని ఈ నెల 27న వారు కోరారు. నగదు లేదని అభిషేక్ చెప్పడంతో ఆగ్రహానికి గురై రాయితో దాడి చేశారు. ఘటనలో గాయపడిన అభిషేక్‌ను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో కుటుంబసభ్యులు చేర్పించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసును నవాబుపేట పోలీసులు నమోదు చేశారు.